క్లుప్తంగా

రక్తహీనత నివారణకు చర్యలు



తూటిపాలలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న సిబ్బంది

మాకవరపాలెం: రక్తహీనత నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని బూరుగుపాలెం వైద్యాధికారి చరణ్ అన్నారు. తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలోపాటు ఇతర పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు ఐరన్ పోలిక్ మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా క్రమం తప్పకుండా ప్రతి వారం ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. వ్యక్తిగత శుభ్రతపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాము, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు సర్వేలో ఒత్తిళ్లకు లోనుకావద్దు



కోడూరులో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో

మాకవరపాలెం: ఓటరు సర్వేలో ఎవరి ఒత్తిళ్లకు లోనుకాకుండా పక్కాగా విచారణ చేయాలని నర్సీపట్నం ఆర్డీవో జయరాం బీఎల్వోలను ఆదేశించారు. జి.కోడూరులో ఓటరు సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నింబధనల మేరకు సర్వే చేస్తున్నారా లేరా అని అడిగి తెలుసుకున్నారు. 2024 జనవరి ఒకటో తేదీకి 18 ఏళ్లు పూర్తయిన వారి వివరాలను గుర్తించాలన్నారు. సర్వేలో నిర్లక్ష్యం చేయొద్దని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తహసీల్దార్ ప్రసాద్‌ను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారు కృష్ణమూర్తి, వీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలతో మేలు



కాలిబాటలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మాకవరపాలెం: వరినాట్లు వేసే రైతులు కాలిబాటలు తీసుకోవడం ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని ప్రకృతి సేద్య విభాగం మండల ఇన్‌చార్జి కవిత అన్నారు. మండలంలోని గిడుతూరు, మల్లవరం, తదితర గ్రామాల్లో రైతులకు కాలిబాటలపై అవగాహన కల్పించారు. దగ్గరుండి రైతులతో ఈ విధానంలో నాట్లు వేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాలిబాటలతో పంటకు గాలి, వెలుతురు బాగా తగలడం వల్ల ఏపుగా పెరుగుతుందన్నారు. సుడిదోమ, తదితర తెగుళ్లను నివారించవచ్చన్నారు. రైతులు నాట్లు వేసే ముందు లేదా నాట్లు వేసిన 15 రోజుల అనంతరం కాలిబాటలు తీసుకోవచ్చన్నారు. సిబ్బంది సుదర్శన్, అప్పారావు, ఈశ్వరి పాల్గొన్నారు.

తల్లి పాల విశిష్టతపై విస్తృత ప్రచారం



గర్భిణులకు కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, సర్పంచ్ రాణి

నాతవరం: తల్లి పాల విశిష్టతపై విస్తృతంగా ప్రచారం చేసి వారిలో చైతన్యం తీసుకురావాలని జెడ్పీటీసీ కాపారపు అప్పలనర్స తెలిపారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ పేరుతో హోమ్ రేషన్ కిట్లు గురువారం ఆమె గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాలు ఉండే కిట్లు అందిస్తున్నారన్నారు. శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించి లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మండలంలో సొంత భవనాలు లేని అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు మంజూరు చేస్తామన్నారు. సర్పంచ్ గొలగాని రాణి, ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, సత్యవతి, రాజేశ్వరి, ఏసురత్నం, ఆయాలు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపాదికన పనులు పూర్తి చేయండి

- లింక్‌రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- అభివృద్ధి పనులపై డిప్యూటీ సీఎం బూడి

కె.కోటపాడు: గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపాదికను పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి బాలాజీ అప్పారావును డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ద్వారా గ్రామాల్లో చేస్తున్న అభివృద్ధి పనులపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సర్పంచ్, ఎంపీటీసీలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రజల రాకపోకల అవసరాలను పరిగణలోనికి తీసుకుని గ్రామాల్లో లింక్‌రోడ్లను తారురోడ్లుగా నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం పూర్తయిన ఒక్కో సచివాలయంలో పలు అభివృద్ధి పనులకు రూ.20 లక్షల చొప్పున మంజూరు చేశామన్నారు. ఇప్పటికే పలు సచివాలయాల్లో పనులు పూర్తి కాగా, మిగిలిన సచివాలయాల్లో పనులను పూర్తి చేయాలని సూచించారు. ఈ పనులు, ప్రభుత్వ కార్యాలయాల భవన నిర్మాణాలు పూర్తయితే ప్రజలకు వాటి వల్ల ప్రయోజనం కలగనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను ఇప్పటికే పూర్తి చేసిన వారికి బిల్లులు చెల్లించామన్నారు. ఇంకా మిగిలి ఉన్న పనులను పూర్తి చేస్తే బిల్లులు వెంటనే మంజూరు కానున్నట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా గ్రామాల్లో ఇంటింటి కుళాయిల నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సచివాలయ భవనాలు పూర్తయిన వాటికి విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని ఈపీడీసీఎల్ (ఈవోపీ) ఆర్డీ ప్రసాద్‌కు సూచించారు. సమావేశంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఓఎస్డీ పోలినాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ఓటరు జాబితా సర్వేపై అలసత్వం వహిస్తే చర్యలు

- దేవరాపల్లిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత ఆకస్మిక తనిఖీ

దేవరాపల్లి: ఇంటింటా ఓటరు జాబితా సర్వేలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.డి. అనిత బీఎల్వోలను హెచ్చరించారు. దేవరాపల్లిలో ఇంటింటా ఓటరు సర్వేను తహసీల్దార్ ఎం. లక్ష్మితో కలిసి గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వే సక్రమంగా చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గంలోని 235 పోలింగ్ కేంద్రాల పరిధిలో లక్షా 91 వేల 303 మంది ఓటర్లు ఉన్నారన్నారు. నియోజకవర్గంలో ఈ సర్వే 45 శాతం మేర పూర్తయ్యిందన్నారు. ఈ నెల 21లోగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించే బీఎల్వోలపై చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారికి జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో కొత్తగా ఓటరు నమోదు చేస్తామన్నారు.



దేవరాపల్లిలో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత

భూసార పరీక్షలతో ఎరువుల వాడకం



రైతులకు వివరిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల: భూసార పరీక్షలు ద్వారా ఎరువులు వాడకం తగ్గుతుందని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. గురువారం మండలంలోని జేడీపేట, కింతలి వల్లాపురం గ్రామాల్లో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ దమ్ములకు దిగుతున్న రైతులు భూసార పరీక్షలు చేసి, వాటి ఫలితాలు ఆధారంగా ఎరువులు వాడకం ద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు. నేలకు అవసరమైన ఎరువులు వాడకం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. అనంతరం ఆధునిక వ్యవసాయ పద్ధతులు గురించి వివరించారు. సర్పంచ్‌లు తాళ్లపురెడ్డి రాంబాయి, కొసిరెడ్డి కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని ర్యాలీ

బుచ్చెయ్యపేట: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ, చోడవరం మండలాలకు చెందిన పలు గ్రామాల క్రైస్తవులు గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. వడ్డాది కోఆపరేటివ్ భవనం నుంచి నాల్గు రోడ్ల జంక్షన్ మీదుగా వేలాది మంది ప్లకార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. తక్షణమే అక్కడ ప్రభుత్వం దాడులు చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో ఫెలోషిప్ అధ్యక్షుడు పి. నోవహ్, కార్యదర్శి డి. నిరీక్షణరాజు, బి. ప్రకాశరావు, వోసన్న, కోరుకొండ రమణ, భూషణం, రూబేనా, బి. ఏసుపాదం, ఎం. తిమోతి దైవజనులు, పలు గ్రామాలకు చెందిన క్రైస్తవ సమాజం, క్రైస్తవ సంఘాల పెద్దలు, చర్చి ఫాదర్లు పాల్గొన్నారు.



వడ్డాదిలో మానవహారంగా ఏర్పడిన క్రైస్తవులు

ఎన్నికల ప్రచార రథానికి పూజలు

చోడవరం రూరల్: జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు గురువారం పార్టీ ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభించారు. ముందుగా రావికమతం మండలం కొత్తకోట శివాలయంలో రథానికి పూజలు చేశారు. అనంతరం నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో పూజలు చేయించారు. ఆయా మండలాల ఇన్‌చార్జులు మైచర్ల నాయుడు, బలిజ మహారాజు, గూనూరు మూలునాయుడు డి.ఎస్.నాయుడు, కర్రి రమేష్, చింతల కిశోర్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

దేవరాపల్లి: అతి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి కోరారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్, ఉద్యాన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం దేవరాపల్లిలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు మెగా ప్లాంటేషన్‌లో భాగంగా సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తితో కలిసి ఆయిల్‌పామ్ మొక్క నాటారు. ఎకరాకు 57 మొక్కలు మేర నాటాలని రైతులకు మాడుగుల ఉద్యానవన శాఖ అధికారి ఆర్. కిరణ్మయి సూచించారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ కంపెనీ విశాఖపట్నం అసిస్టెంట్ మేనేజర్ కె.రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.వి.వి. సురేష్, గోదాం ఇన్‌చార్జి చొక్కాకుల సన్యాసినాయుడు, ఎస్. రాము, స్థానిక వ్యవసాయ సహాయకులు కె. సత్యారావు, భాగ్య పాల్గొన్నారు.

వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి

చీడికాడ: రైతులు సంప్రదాయ పంటలతో వాణిజ్య పంటలపై దృష్టి సారిస్తే మరింత ఆదాయం సమకూరుతుందని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. గురువారం బైలపూడిలో గుమ్మాల నాగరాజు, పెరునాయుడు అనే రైతులకు చెందిన ఐదెకరాల పొలంలో నిర్వహించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. సర్పంచ్ గంగతల్లి, ఫీల్డ్ ఆఫీసర్ నాయుడు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ సాయిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేతలు స్వామినాయుడు, కురచా నారాయణమూర్తి పాల్గొన్నారు.



దేవరాపల్లిలో ఆయిల్‌పామ్ మొక్క నాటుతున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, తదితరులు

పీఆర్టీయూ కార్యవర్గం ఏకగ్రీవం



అధ్యక్షుడు సూర్యనారాయణ



ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్



గౌరవాధ్యక్షుడు సాంబశివరావు

రోలుగుంట: పీఆర్టీయూ మండల కార్యవర్గం ఏకగ్రీవమైంది. రోలుగుంట మండలం సంఘ అధ్యక్షుడిగా పని చేసిన జి.వి.రమణ వేరొక మండలానికి బదిలీ కావడంతో ఎన్నిక అనివార్యమైంది. మండలంలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయులతో గురువారం సమావేశమై ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా జామి సాంబశివరావు, అధ్యక్షుడిగా బండారు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బి.చంద్రశేఖర్, జిల్లా కౌన్సిలర్‌గా ఏకా నర్సింహమూర్తి, మరి కొంతమందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. యూనియన్ స్టేట్ సెక్రటరీ జీపీఎస్ నాయుడు ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు.

అసంఘటిత కార్మికులకు ఈ- శ్రమ్ కార్డులు

- చోడవరం డివిజన్ కార్మిక శాఖ అధికారి సూర్యనారాయణ

రావికమతం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ-శ్రమ్ కార్డును ప్రతి అసంఘటిత కార్మికుడు పొందాలని చోడవరం డివిజన్ కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ అన్నారు. గురువారం కొత్తకోటలో పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. బాల కార్మికులు ఎవరైనా ఉన్నారా, దుకాణాలకు లైసెన్స్ ఉందా అని ఆరా తీశారు. ఆపై పలు దుకాణాల్లో పనిచేస్తున్న 18–58 ఏళ్ల అసంఘటిత కార్మికులతో సమావేశమయ్యారు. తన పరిధిలోని 16 మండలాల్లో ఈ ఏడాది 1,44,454 మందికి ఈ- శ్రమ్ కార్డులివ్వాలని లక్ష్యంగా చేసుకుని ఇప్పటికి 61 వేల మందికి అందించామన్నారు. ఈ కార్డు పొందిన వారు ప్రమాదవ శాత్తు మృతి చెందితే రూ.2 లక్షల బీమా పరిహారం వస్తుందన్నారు. 60 ఏళ్లు పైబడిన వారికి నెలకు రూ.3 వేలు భృతిగా వస్తుందన్నారు. కొంత మంది కార్మికులకు అక్కడికక్కడే కార్డులను అందించారు.



కార్మికులకు ఈ- శ్రమ్ కార్డులందిస్తున్న కార్మిక శాఖాధికారి సూర్యనారాయణ

విద్యుత్ సరఫరా నిలిపివేత నేడు

దేవరాపల్లి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ కె. శంకరరావు గురువారం తెలిపారు. పినకోటకు విద్యుత్ సరఫరా చేసే 11 కేవీ ఫీడర్ బ్రేకర్లు మార్పు చేయడంతోపాటు సబ్ స్టేషన్‌లో వివిధ మరమ్మతులు చేపడుతున్నందున సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. సబ్ స్టేషన్ పరిధి గ్రామాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

మన్యం బంద్‌కు మద్దతుగా ప్రదర్శన

మాడుగుల రూరల్: మన్యం బంద్‌కు మద్దతుగా ఎం.గదబూరులో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ. నర్సింహమూర్తి, దేవుళ్లు, బి. నాగరాజు, జోగారావు, భూలోకమ్మ, గడ్డమ్మ పాల్గొన్నారు.

20 పడకల స్థాయికి రోలుగుంట పీహెచ్‌సీ

- రోలుగుంట పీహెచ్‌సీ అదనపు భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శంకుస్థాపన

రోలుగుంట: స్థానిక పీహెచ్‌సీని పది పడకల నుంచి 25 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. ఇక్కడ పీహెచ్‌సీ ఆవరణలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టే పనులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు గురువారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాల పరిధిలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టరు ద్వారా గ్రామస్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రోగి ఇంటికి వైద్యులే వెళ్లి సేవలందించడం విశేషమన్నారు. ప్రధానంగా ఈ రోజు ప్రారంభించిన భవనం పూర్తయితే, ల్యాబ్ ఏర్పాటుతోపాటు రోగులకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు ధనలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో కృష్ణ, కొప్పుల వెలమ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, పార్టీ మండలాధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు, సర్పంచ్‌లు పోతల రాజశేఖర్, బంటు సూర్య సన్యాసి దేముళ్లు పాల్గొన్నారు.



భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బీఎన్ రోడ్డులో గోతుల పూడ్చివేత

- వరద నీరు నిల్వ ఉండకుండా కాలువల ఏర్పాటు



గోతులను పూడ్చి జేసీబీతో కాలువలు తీయిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట: విజయరామరాజుపేట వద్ద భీమునిపట్నం- నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో గోతులను ఆర్‌అండ్‌బీ అధికారులు పూడ్చివేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మధ్యలో నీరు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశాలతో గురువారం ఆర్‌అండ్‌బీ అధికారులు జేసీబీతో రోడ్డుపై ఏర్పడ్డ గోతులను పూడ్పించడమే కాక వర్షం నీరు నిల్వ ఉండకుండా బయటకు పోయేలా జేసీబీతో కాలువలు తీయించారు. రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామంలో 40 అడుగుల మేర సీసీరోడ్డు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. రోడ్డు పనులను సర్పంచ్ ఎల్లపు విజయ్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద పర్యవేక్షించారు.

ప్రజా అవసరాలను తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- ముగిసిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తీర్చేవిధంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 25వ వార్డులో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వార్డులో ప్రతి ఇంటిని సందర్శించి సంక్షేమ పథకాలపై ఆరా తీసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏడాది క్రితం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నేటితో ద్విజయంగా ముగిసిందన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించామన్నారు. పనులు ప్రారంభమయ్యాయన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. సీఎం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వల్లే తాను ఏ గ్రామం వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ప్రతి ఇంట్లో ఎంతో కొంత లబ్ధి చేకూరిందన్నారు. మరో 30 ఏళ్లు జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, వార్డు ఇన్‌చార్జి దేవత అరుణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకాశివ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషాబేగం, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, బేతిరెడ్డి రత్నం, మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, నూకాంబిక దేవస్థానం చైర్మన్ ధనిమరెడ్డి నాగు, పార్టీ సీనియర్ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, లగుడు స్వామి, పార్టీ నాయకులు గంటా లలిత, అన్నపూర్ణ, లోకవరపు శారద, కొణతాల వరలక్ష్మి, పార్టీ నాయకులు యాదగిరి శేషు,లాలం అప్పారావు పాల్గొన్నారు.

కింతాడలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



కింతాడలో ఆరోగ్య సర్వే కార్యక్రమంలో పాల్గొన్న గణాంకాధికారి రామచంద్రరావు

కె.కోటపాడు: ప్రజలు మెరుగైన ఆరోగ్యంతోపాటు అనారోగ్య సమస్యలకు చేస్తున్న ఖర్చు, ప్రభుత్వం ద్వారా అందుతున్న వైద్యంపై కింతాడ గ్రామ పంచాయతీలో గురువారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ గణాంకాధికారి ఏ రామచంద్రరావు పాల్గొని ఇంటింటికీ వెళ్లారు. ఆస్పత్రిలో ప్రసవాలు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, చిన్నారులకు, గర్భిణులకు వ్యాధినిరోధక టీకాలు, రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రల పంపిణీ వంటి ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. బాలింతలకు జేఎస్ఎస్‌వై, జేఎస్ఎస్‌ఏ వర్తించాయా లేదా తెలుసుకున్నారు. వైద్యాధికారులు నిర్మల, సుబ్రహ్మణ్యం, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, ఏఎన్ఎం నాగమణి, ఉప సర్పంచ్ బండారు ముత్యాలనాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

- ఉమ్మడి విశాఖ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ అనురాధ

కె.కోటపాడు: గర్భిణులు, బాలింతలకు ఇకపై టేక్ హోం రేషన్‌గా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ అన్నారు. కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం కె.కోటపాడులో టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా నాణ్యమైన బియ్యం, కందిపప్పు, అటుకులు, చెక్కీలు, పాలు, గుడ్లు, కందిపప్పుతో కూడిన టేక్ హోం రేషన్ కిట్లు గర్భిణులకు, బాలింతలకు ఇస్తున్నామన్నారు. వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల గర్భిణులు ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మనిస్తారని సూచించారు. అనంతరం సామూహిక సీమంతాలు కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. ఐసీడీఎస్ పీవో మంగతాయారు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం మండలాధ్యక్షుడు పైల అమ్మాజి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కె.కోటపాడులో గర్భిణులకు, బాలింతలకు టేక్ హోం రేషన్ కిట్లు అందిస్తున్న అనురాధ

కల్యాణ మండపం పనుల పరిశీలన

మాడుగుల: స్థానిక మోదమాంబ కాలనీలో కల్యాణ మండపం పనులు జోరుగా సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో రూ. 30 లక్షలు ఎంపీ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేస్తున్న ఈ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఈ మేరకు శ్లాబ్ దశ పనులను డీఈ రమణ, ఏఈ శ్రీనువాసరావు గురువారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిర్మాణం పూర్తయితే శుభకార్యాల నిర్వహణకు ఇబ్బందులు తొలగనున్నాయని కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబరు జవ్వాది వరహాలు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ మండప నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ రమణ, ఏఈ శ్రీనువాసరావు

ఓటరు సర్వేలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం

నాతవరం: బీఎల్వోలంతా అంకిత భావంతో పని చేస్తూ ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరాం ఆదేశించారు. గురువారం ఆయన ములగపూడి బెన్నవరంలో 58, 59 పోలింగ్ కేంద్రాల్లో ఇంటింటికి స్వయంగా వెళ్లి ఓటర్ల నమోదు ప్రక్రియ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడమే ధ్యేయంగా తహసీల్దార్లతోపాటు పోలింగ్ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. ముందుగా రాజకీయ పార్టీల నాయకులకు ఓటరు నమోదు తదితర అంశాల్లో నియమ నిబంధనలపై అవగాహన కల్పించామన్నారు. సర్వేలో బీఎల్వోలు మినహా ఏ రాజకీయ పార్టీ నాయకులు గానీ, వలంటీర్లుగానీ ఉండకూడదన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లఘించి వ్యవహరించినట్లుగా తమ దృష్టికి వస్తే, ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా తహసీల్దార్లకు ఎప్పటికప్పుడు టెలీకాన్ఫరెన్స్‌లో వివరించాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ములగపూడిలో తనిఖీ చేస్తున్న ఆర్డీవో జయరాం తహసీల్దార్ నాయుడు